చింతకుంట వద్ద కేసీఆర్‌కు ఘనంగా వీడ్కోలు పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

చెక్కు చెదరని అభిమానం

- కరీంనగర్ పర్యటన నుంచి కేసీఆర్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తపల్లి, మే 10 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రజల్లో ఏ మాత్రం అభిమానం తగ్గ లేదు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు గురువారం నగరానికి వచ్చిన కేసీఆర్ శుక్రవారం సిరిసిల్ల ఎన్నికల ప్రచారానికి పయనమయ్యారు. తెలంగాణ భవన్ నుంచి బయలు దేరిన ఆయనకు అడుగడుగునా అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. చింతకుంటలో కేసీఆర్ బస్సును ఆపి ఆయనపై పూల వర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. ఇక్కడ సుడా మాజీ డైరెక్టర్ భూక్యా తిరుపతినాయక్, జయప్రకాశ్‌రెడ్డి, మైనార్టీ నాయకులు, ప్రజలు ఉన్నారు.

వినోద్‌కుమార్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- బీఆర్ఎస్ నాయకులకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

ఉత్తర తెలంగాణ భవన్ నుంచి సిరిసిల్లకు బయలుదేరి వెళ్తున్న కేసీఆర్

కరీంనగర్ రూరల్, మే 10: ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుక బోయినపల్లి వినోద్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపాల్సిన అవసరం ఎంతో ఉందని, ఎన్నికల్లో శ్రమించి ఆయన గెలుపు కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నాయకులకు సూచించారు. గురువారం రాత్రి కరీంనగర్ రోడ్ షోకు వచ్చిన ఆయన రాత్రి 9.34 గంటలకు తీగలగుట్టపల్లిలోని ఉత్తర తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. తర్వాత ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్‌తో కలిసి నగరంలోని ప్రస్తుత పరిస్థితులు, వివిధ పార్టీల బలాబలాలపై చర్చలు జరిపారు. ఎన్నికల్లో వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించేలా బాధ్యతతో పని చేయాలని సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ తదితరులు కేసీఆర్‌ను కలిశారు. సాయంత్రం 4.39 గంటలకు ఉత్తర తెలంగాణ భవన్ నుంచి కేసీఆర్ సిరిసిల్ల రోడ్ షోకు బయలు దేరి వెళ్లారు. నగరంలో దారి పొడవున అభిమానులు ఆయనకు అభివాదం చేస్తూ వీడ్కోలు పలికారు.

చెత్త కుప్పలో శిశువు మృతదేహం

హుజూరాబాద్‌టౌన్, మే10: హుజూరాబాద్ బస్టాండులోని మరుగుదొడ్ల సమీపంలో చెత్తకుప్ప వద్ద అప్పుడే పుట్టి మృతి చెందిన ఆడ శిశువును శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పారవేసి వెళ్లారు. నవజాత శిశువుకు చీమలు పట్టడంతో పాటు దుర్వాసన వస్తుండడంతో అటుగా వెళ్తున్న ప్రజలు చూసి పోలీసులకు సమాచారం అందించారు. శిశువు మృతదేహాన్ని పోలీసులు ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

సైలెన్స్ పీరియడ్‌లో ప్రచారం నిషేధం

- బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపినా, ర్యాలీలు తీసినా కఠిన చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

మాట్లాడుతున్న డీఈవో పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 10 : పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎన్నికల ప్రచారంపై నిషేధం ఉంటుందని, సైలెన్స్ పీరియడ్‌లో అభ్యర్థులు, పార్టీలకు అనుకూలంగా ఎలాంటి ర్యాలీలు తీసినా, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శనివారం సాయంత్రం 6 నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు గల సమయాన్ని సైలెన్స్ పీరియడ్‌గా పరిగణిస్తారని, ఈ సమయంలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేసిన వారంతా విడిది చేసిన హోటళ్లు, లాడ్జీలు ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఎఫ్ఎస్‌సీ, ఎంసీసీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగుల్లో విధిగా తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 12, 13 తేదీల్లో పత్రికల్లో వచ్చే ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ అనుమతి తప్పనిసరని చెప్పారు. సమావేశంలో సెగ్మెంట్ పరిధిలోని ఏఆర్‌వోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లో పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించాలి

కలెక్టరేట్, మే 10 : పోలింగ్‌కు ముందు 48 గంటలు పాటు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే అంశంలో ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించాలన్నారు. కాగా, అంతకుముందు జిల్లా ఎన్నికల అధికారి ఇతర అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు అన్ని పకడ్బందీగా ఉండాలన్నారు. అధికారులు సిబ్బంది నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్ బాబు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

రాంనగర్, మే 10: ఎన్నికల విధుల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆదేశించారు. రాంనగర్‌లోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల, బైపాస్‌లో గల కమిషనరేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు ఎన్నికల రోజు నిర్వహించే విధుల గురించి సూచనలు చేశారు. ఆదివారం ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుందని, పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రి, ఈవీఎంలను స్వీకరించిన తర్వాత వాటికి భద్రతగా వారితో పాటు, కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. ఏదైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో పాటు కమిషనరేట్ పోలీస్ సెంటర్ ప్రిన్సిపాల్ ఏ లక్ష్మీనారాయణ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిట్స్‌లో ముగిసిన సెమినార్

హుజూరాబాద్‌రూరల్, మే 10: సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఎస్‌టీఈ, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్డీ నో ఫర్ బిగినర్స్' అంశంపై నిర్వహించిన వారం రోజుల సెమినార్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రయోగాత్మక విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ఇటు ఈ టెక్నాలజీస్ హైదరాబాద్ డైరెక్టర్ అనిల్ ముదులాకర్ శిక్షణ ఇచ్చారు.

గడ్డివాము దగ్ధం.. లేగ దూడ మృతి

చిగురుమామిడి, మే 10 : బొమ్మనపల్లిలో కత్తుల దేవేందర్ అనే రైతు వ్యవసాయ బావి వద్ద అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బాక్సులు కొట్టివేయడంతో మంటలు చెలరేగాయి. సమీపంలో నిల్వ చేసిన 15 ట్రిప్పుల గడ్డి పూర్తిగా దగ్ధమైంది. వేడి తీవ్రతకు అక్కడే ఉన్న లేగ దూడ మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని దేవేందర్ కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

కార్పొరేషన్, మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద చేస్తున్న ఏర్పాట్లను నగర పాలక కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, లైటింగ్, కుర్చీలు, టేబుల్ తదితర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు అనువుగా ఉండేలా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే లైటింగ్, కుర్చీలు, టెంట్లు వేసి సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ మహేందర్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

తిమ్మాపూర్ రూరల్, మే 10: తిమ్మాపూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఈనెల 10 నుంచి 31లోగా https://www.tsmodelschools.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి 'ది ఎపిక్ న్యూ స్విఫ్ట్' కార్

ఎపిక్ న్యూ స్విఫ్ట్ కార్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న మంత్రి పొన్నం

విద్యానగర్, మే 10: కరీంనగర్‌లోని ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మారుతి ఏరిన షోరూంలో నూతన మార్పులతో వచ్చిన ఫోర్త్ జనరేషన్ షిఫ్ట్ కారును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం విడుదల చేశారు. ఆదర్శ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బూరుగు సత్యనారాయణ గౌడ్ స్విఫ్ట్ కార్ ప్రత్యేకతలను వివరించారు. ఇందులోని కొత్త జెడ్ సిరీస్ ఇంజిన్ ఎక్కువ మైలేజ్ ఇస్తుందన్నారు. మైలేజ్ మాన్యువల్‌లో 24.80 కేఎంపీఎల్, ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్‌లో 25.75 కేఎంపీఎల్ ఉందని తెలిపారు. ఆరు ఎయిర్ బ్యాగ్స్, స్టాండర్డ్ ఫ్యూచర్‌గా కొత్త తొమ్మిది ఇంచుల టచ్ స్క్రీన్, వైర్‌లెస్ చార్జర్, ఎల్ఈడీ ఫోగ్ లాంప్స్, రేర్ ఎసివెంట్స్, ఆల్ త్రీపాయింట్ సీట్ బెల్ట్ రిమైండర్, సుజుకి కనెక్ట్ ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలి

తిమ్మాపూర్, మే 10: ప్రజల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి వైద్యుడు కృషి చేయాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రవి నాయక్ సూచించారు. శుక్రవారం సాయంత్రం తిమ్మాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం జిల్లా వైద్యశాఖ అధికారి కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని హాస్పిటళ్లలో నిబంధనలను పాటించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులు డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ జువేరియా, డాక్టర్ సనా జవేరియా, రంగారెడ్డి, కాంతారావు, శిల్పారెడ్డి, తులసి రవీందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

వీణవంక, మే 10: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (2004-05లో పదో తరగతి బ్యాచ్) అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆటపాటలతో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వోరెం సాగర్, దేవునూరి శ్రీనివాస్, వేణు రాజు, శ్రీధర్, తరుణ్, రాజు, ఉపాధ్యాయులు కేదారేశ్వర్, సాంబయ్య, రాంచందర్, ప్రకాశ్, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

కలెక్టరేట్, మే 10: ప్రజాస్వామ్య పరిరక్షణకు మన చేతిలో ఉన్న ఓటే వజ్రాయుధమని తెలంగాణ జనసత్తా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ముదుగంటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని భాగ్యనగర్‌లో తెలంగాణ జనసత్తా ఆధ్వర్యంలో 'లోక్‌సభ ఎన్నికలు – ఓటరు కర్తవ్యం' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, వందశాతం పోలింగ్‌కు తమ వంతు సహకారం అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. సమావేశంలో జనసత్తా ప్రతినిధులు ముదుగంటి దామోదర్‌రెడ్డి, కొలిపాక సత్యనారాయణ, గునుకుల సత్యనారాయణరెడ్డి, నన్నపు రాజు, గిరిబాబుతో పాటు భాగ్యనగర్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'డీఈవోను విధుల నుంచి తొలగించాలి'

హుజూరాబాద్‌టౌన్, మే10: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు డీఈవో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయనను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణాప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోశాధికారి కెంసారపు రవితేజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎటువంటి అనుమతులు లేకున్నా అడ్మిషన్లు చేసుకుంటున్నాయని, దీనికి డీఈవో నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా కెంసారపు రవితేజ, డివిజన్ ఉపాధ్యక్షుడిగా కొయ్యడ రాకేశ్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి అజయ్, సహాయ కార్యదర్శిగా కొయ్యడ శ్రీజ, కోశాధికారిగా బొడిక బన్నీ, సభ్యులుగా గాజుల అన్వేష్, పులి నివాస్, దాసారపు పవన్, అంబాల నవీన్ తదితరులు ఎన్నికయ్యారు.

నిందితులకు పోలీస్ కస్టడీ

రాంనగర్, మే 10: తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో గంప రమాదేవి ఫిర్యాదు మేరకు నిందితులు దేవసాని శ్రావణ్ కుమార్, పోరండ్ల శ్రీనివాస్‌ను కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ ప్రదీప్ కుమార్ ఈ నెల 4న తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా, ఈ కేసుకు సంబంధించిన మరింత కీలక సమాచారం సేకరించేందుకు గాను నిందితులిద్దరిని కోర్టు అనుమతితో అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 11 నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకు విచారణకు అనుమతించడంతో కస్టడీలోకి తీసుకుని విచారించినట్లు సీఐ తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ.18.75 లక్షలు పట్టివేత

రాంనగర్, మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో అక్రమ డబ్బు, మద్యం, ఇతర కానుకల పంపిణీని అరికట్టేందుకు పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో శుక్రవారం ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.18,75,651 నగదు పట్టుబడింది. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐబీ చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీలో రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన గుమ్మడి రమేశ్ నుంచి రూ.6లక్షలు, మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన పడాల హరీశ్ నుంచి రూ.12,75,651ను పట్టుకుని స్వాధీన పరుచుకున్నట్లు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలో మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన అలగం కుమారస్వామి నుంచి రూ.88 వేలను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం దుకాణాల మూసివేత

రాంనగర్, మే 10 : ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనున్న దృష్ట్యా ముందస్తుగా మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకునే భద్రతా చర్యల్లో భాగంగా కల్లు డిపోలు, వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, స్టార్ హోటళ్లు, క్లబ్బులు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం వరకు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 13వ తేదీన కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. 11న సాయంత్రం 6 గంటల నుంచి 13 సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

నిధులు తేని 'బండి'కి ఓట్లడిగే హక్కులేదు

- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం

కార్పొరేషన్, మే 10: కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం ఓటర్లకు పిలుపునిచ్చారు. ఐదేండ్లు ఎంపీగా పదవి వెలగబెట్టి అభివృద్ధికి ఐదు రూపాయల నిధులు తేని బండి సంజయ్‌కు ఓట్లడిగే నైతిక హక్కులేదని ఆక్షేపించారు. శుక్రవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ఉద్యమ పంథాలో రాష్ట్రాన్ని సాధించి ఇక్కడి ప్రజల కలను సాకారం చేశారన్నారు. అధికారం చేపట్టి తెలంగాణను అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపారని కొనియాడారు. కానీ అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఐదు నెలల్లోనే పాలనలో వైఫల్యం చెందిందని విమర్శించారు. మన రాష్ట్రానికి న్యాయం జరగాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉండాల్సిందేనని చెప్పారు. ప్రజలు ఆలోచించి ప్రగతి ప్రదాత, ప్రశ్నించే గొంతుకైనా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎన్ఆర్ఐ విభాగం నాయకులు రాజ్‌కుమార్, ప్రశాంత్, ప్రణయ్, వినయ్, బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

వినోద్‌కుమార్‌కు దళిత సంఘాల మద్దతు

కార్పొరేషన్, మే 10: కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు దళిత సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. శుక్రవారం నగరంలో వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో దళిత సంఘాల నాయకులు ఆయనను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్, బీజేపీలు రిజర్వేషన్ల రద్దు అంటూ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. రిజర్వేషన్లను రద్దు చేసే హక్కు ఎవ్వరికీ లేదని 2006లోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతి సమస్యపై మాట్లాడి ప్రజల పక్షాన నిలిచే వినోద్ కుమార్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ మాట్లాడుతూ, దళితుల పక్షాన నిలిచే తనకు ఆయా సంఘాలు మద్దతు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ కేవలం తమ ఓట్ల కోసమే తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, నాయకులు వంతడుపుల సంపత్, సాంబారి కొమురయ్య, క్యాదాసు ప్రభాకర్, భీమారపు సతీశ్, పారునంది జలపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

హుజూరాబాద్/ తిమ్మాపూర్/ తిమ్మాపూర్ రూరల్/ శంకరపట్నం, మానకొండూర్/ చిగురుమామిడి/ సైదాపూర్/ వీణవంక, మే 10: జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రచారం జోరందుకున్నది. ఇందులో భాగంగా శుక్రవారం హుజూరాబాద్, తిమ్మాపూర్, శంకరపట్నం, చిగురుమామిడి, సైదాపూర్, వీణవంక, మానకొండూర్ మండలాల్లో గ్రామగ్రామాన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ, ఓటు అభ్యర్థించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

420 హామీలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, మే 10: అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటిని అమలును విస్మరించి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మహిళలకు రూ.2500 పెన్షన్, రైతులకు రుణమాఫీ, 500 రూపాయల పంట బోనస్ లాంటివి ఆరు గ్యారెంటీలలో లేవా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో పూర్తిస్థాయిలో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని 29వ వార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొని పలువురిని ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నట్లు ఆరు గ్యారెంటీల అమలు పచ్చి అబద్ధమన్నారు. జిల్లా ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

ప్రచారంలో పాల్గొన్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, స్థానిక కౌన్సిలర్ రమేశ్, నేతలు

రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలు జరుగాలంటే బీఆర్ఎస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా గెలిపించాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 50 వేల మెజారిటీ పైచిలుకు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే ఇద్దరం కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, స్థానిక కౌన్సిలర్ ముక్క రమేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూపీఎస్సీ, ఎన్డీఏ ఫలితాల్లో సైనిక్ విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి, మే 10: యూపీఎస్సీ, ఎన్డీఏ పరీక్ష ఫలితాల్లో రుక్మాపూర్ సైనిక పాఠశాలలో విద్యనభ్యసించిన అయిదుగురు విద్యార్థులు వీ అభిలాష్, ఆర్ సిద్ధార్థ జీ వినయ్ కుమార్, జే నర్సింహులు, ఎం విష్ణువర్ధన్ ఉత్తీర్ణత సాధించి, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు సెలెక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ లచ్చయ్య తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

'రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో బీజేపీ'

కార్పొరేషన్, మే 10: దేశంలో మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ ఆరోపించారు. కాంగ్రెస్ మొదటి నుంచి దళితులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నదని విమర్శించారు. శుక్రవారం కిసాన్ నగర్‌లో దళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు అన్ని సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు కంసాల శ్రీనివాస్, మాదిగ సంఘం నాయకులు సంపత్ అశోక్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, నాయకులు సాంబారి కొమురయ్య, నాయకులు జస్వంత్, సతీశ్, అనిల్, నిజాంపేట శ్రీనివాస్, కనుమల్ల శ్రీనివాస్, బుర్ర సామయ్య, తాటిపల్లి ప్రభు, క్రాంతి, నవీన్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

తెలంగాణచౌక్, మే 10: కార్మికులకు న్యాయమైన హక్కులు దక్కాలంటే, పార్లమెంట్‌లో మన గళం వినబడాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, ఆటోయూనియన్ సంక్షేమ సంఘం నగర కమిటీ అధ్యక్షుడు మద్దెల రాజేందర్ కోరారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఏనాడూ కార్మికులు, పేదల గురించి పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించి ఆటోకార్మికుల పొట్టగొట్టిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతు ప్రకటించారు. సమావేశంలో కార్మిక సంఘం నేతలు సంపత్, సత్యనారాయణ, కుమార్, రమేశ్ ఉన్నారు.

ఓటు హక్కుపై కరాటే ప్రదర్శనతో అవగాహన

కరాటే ప్రదర్శనలతో ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి, మే 10 : 'ఓటు హక్కును వినియోగిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం' అనే నినాదంతో కరాటే క్రీడాకారులు పలు ప్రదర్శనలు నిర్వహించి ఓటు ప్రాముఖ్యతపై నగరవాసులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఉదయం గీతాభవన్ చౌరస్తాలో జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వేయడం మన అందరి బాధ్యత, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ మే 13వ తేదీన ఓటు వేయాలని కోరుతూ విద్యార్థులు ప్రదర్శించిన కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరాటే అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రైటర్ మైండ్స్ గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 10 : జిల్లా కేంద్రంలోని రాంనగర్ శ్రీరామచంద్రమిషన్ ఆశ్రమంలో బ్రైటర్ మైండ్స్ ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలు పరిశీలించారు. మాస్టర్ ట్రైనర్ డాక్టర్ వెంకటేశ్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ రామచంద్ర మిషన్ కరీంనగర్ జోనల్ కో ఆర్డినేటర్ వెంకటరమణారావు, జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, సెంటర్ కోఆర్డినేటర్ సుధాకర్, శిక్షణ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రీరామచంద్ర మిషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253 NT-3277

CHANGE OF NAME

★I, PALLIKONDA SOUNDARYA, R/o. 1-106/9, KUMMARIPELLI, RAIKAL, JAGITYAL, TS. Changed My Name As ALUGOTTU PAVANI W/o. ALUGOTTU RAJASHEKAR NT-327821

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571 91827 77194